పుల్లశనగపై రైతుల ఆశలు

- వరదల్లో నష్టపోయిన పత్తి, మినుము
- ప్రత్యామ్నాయంగా పుల్లశనగ సాగుపై ఆసక్తి
- ఐదు వేల ఎకరాలలో సాగుకు అవకాశం



నరుకుళ్లపాడు వాగు సమీపంలో శనగ చేను(ఫైల్)

అమరావతి: గతేడాది పత్తిపంటకు గులాబిరంగు తెగులు ఆశించి దిగుబడులు రాకపోవటం, ఈఏడాది వాతావరణం అనుకూలించక రైతులు ప్రత్యామ్నాయ పంటలైన పుల్లశనగ, మినుము సాగుపైనే దృష్టి సారించారు. ఈఏడాది ఖరీఫ్‌లో భారీ వర్షాలు, వరదల వల్ల సాగు చేస్తున్న పత్తి పంట పూత పిందె దశలో దెబ్బతింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో రైతులు ఆర్థికంగా వెసులుబాటు కోసం వాగుల పరీవాహక ప్రాంతాలతో పాటుగా, వరదలు, వర్షాల వలన నష్టపోయిన మెట్ట పొలాల్లో రైతులు వాణిజ్య పంటలకు ప్రత్యామ్నాయ పంట పుల్ల శనగ సాగుచేయటానికి ఆసక్తి చూపుతున్నారు.

మెట్లపొలాల్లో అధికసాగు

మండలంలోని ఎండ్రాయి, నరుకుళ్లపాడు, చావపాడు, ఎనికపాడు, పెదమద్దూరు, వైకుంఠపురం, నెమలికల్లు, ఉంగుటూరు, అమరావతి, ధరణికోట, మునగోడు గ్రామాలకు చెందిన రైతులు మెట్ట పొలాల్లో పుల్లశనగ ఎక్కువగా సాగు చేస్తున్నారు. గతేడాది వాణిజ్యపంటలకు ప్రత్యామ్నాయ పంటగా పెదకూరపాడు నియోజవర్గంలో రెండు వేల ఎకరాలలో శనగ సాగు చేసిన రైతులకు కొంత మేర లాభాలు పొందటంతో ఈఏడాది నియోజవర్గంలోని ఐదు మండలాలలో సుమారు ఐదువేల ఎకరాలలో సాగుచేయటానికి రైతులు సిద్ధం అవుతున్నారు.

పెట్టుబడి తక్కువ..

పత్తి, మిర్చి వంటి వాణిజ్య పంటలతో పోల్చుకుంటే పుల్లశనగ సాగుకు పెట్టే పెట్టుబడి తక్కువే. పత్తికి ఎకరాకు 30 నుంచి 40 వేల రూపాయలు పెట్టుబడి పెట్టాలి. శనగకు అయితే విత్తనాలతో సహా 8 వేల నుంచి రూ.12వేల వరకు ఖర్చు అవుతుంది. వ్యవసాయశాఖ సూచనల మేరకు ఎకరాకు 40 కిలోల విత్తనాలు విత్తాల్సిఉండగా రైతులు ప్రస్తుతమున్న పరిస్థితులలో మొలకశాతం తక్కువగా ఉండటంతో 60 కిలోలు విత్తనాలు విత్తుకోవాల్సి వస్తుంది.

సబ్సిడీ తగ్గింది– రైతుపై భారం పెరిగింది

గతేడాది పుల్లశనగ సాగుచేసే రైతులకు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జెజీ–11 రకం విత్తనాలు కిలో రూ.81 ఉండగా నలభైశాతం సబ్సిడీపై రూ.48.60 రైతులకు అందించారు. ఈ ఏడాది రూ.94 ఉన్న కిలో పుల్లశనగ విత్తనాలను 25 శాతం సబ్సిడీతో రూ.70.50లకు అందిస్తున్నారు. అలాగే రూ.121 ధర ఉన్న తెల్ల శనగలను సబ్సిడీపై రూ.90.75 పంపిణీ చేస్తున్నారు.

పత్తి నష్టపోవడంతో..



వరదల వలన పత్తి మునిగి పోయింది. దీంతో పుల్లశనగ సాగు చేస్తున్నాం. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో గత ఏడాది కంటే రెండు ఎకరాల ఎక్కువగా శనగసాగు చేయటానికి సిద్ధం చేసుకున్నా. అసలే పత్తి పంట దెబ్బతిని నష్టపోయాం ఈఏడాది విత్తనాలు గతేడాది కంటే ధర పెరిగటంతో పెట్టుబడి పెరిగింది. శనగ వేస్తే ఎకరాకు 7నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తేనే ఒడ్డున పడతాం.

– మేకల బుల్లెబ్బాయి, రైతు నరుకుళ్లపాడు

ప్రత్యామ్నాయంగా శనగ సాగు



ఈఏడాది కాలం పత్తికి అనుకూలించకపోవటం, వరదలు, వర్షాల వల్ల పత్తి పూర్తిగా దెబ్బతినటంతో పత్తి పంట స్థానంలో పుల్లశనగకోసం వెనక చిక్కున 15 ఎకరాల పొలాన్ని సిద్ధం చేశాం. కొంతమేర మినుము వేస్తే ఇటీవల వచ్చిన తుపానుకు తుడిచిపెట్టుకు పోయింది. మినుము స్థానంలో శనగ వేసుకోవాల్సి వచ్చింది. ఇప్పటికే పత్తి, మినుము సాగు వల్ల నష్టపోయాం . పుల్లశనగ పంటపైన ఆశ పెట్టుకున్నాం. ఈ పంట చేతికొస్తేనే కోలుకుంటాం లేకపోతే అప్పులు మిగులుతాయి.

– రంగిశెట్టి శ్రీనివాసరావు, రైతు వైకుంఠపురం

సబ్సిడీపై పుల్లశనగ విత్తనాలు

రైతులకు అన్ని సచివాలయాలలో పుల్లశనగ విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నాం. నియోజకవర్గంలో గతంలో కంటే ఈఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. అందుకు అనుగుణంగానే విత్తనాలు పంపిణీ చేస్తున్నాం. నియోజవర్గంలో సుమారు 5వేల ఎకరాలలో పుల్లశనగ సాగు చేస్తారని అంచనా. ఎకరాకు 40 కిలోలు చొప్పున ఒక రైతుకు ఐదు ఎకరాలకు మాత్రమే సబ్సిడీపై శనగ విత్తనాలు అందిస్తున్నాం.

– వి.హనుమంతరావు, ఏడీఏ, క్రోసూరు

పత్తి అమ్మకాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



పొలం పిలుస్తోంది గ్రామసభలో మాట్లాడుతున్న ఏఓ వేణుగోపాల్

క్రోసూరు: సీసీఐకి పత్తి విక్రయించాలనుకునే రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ వేణుగోపాల్ సూచించారు. మండలంలోని బయ్యవరం, ఊటుకూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ మాట్లాడుతూ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా పత్తి క్వింటాకు కనీస మద్దతు ధర రూ.7,521 చొప్పున కొనుగోలు చేస్తుందన్నారు. దీనికి రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే గ్రామాల్లోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి పరిష్కరించుకోవాలని చెప్పారు. రబీ సీజన్ నుంచి రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బ్యాంకులో రుణం తీసుకున్న రైతులకు బ్యాంకు ప్రీమియం రుసుంను మినహాయించుకుని మిగిలిన రుసుంను ఇస్తారని అన్నారు. బ్యాంకు రుణం తీసుకోని రైతులు, కౌలు రైతులు సీఎస్‌సీ సెంటర్ల ద్వారా పీఏసీఎస్ లో గాని ప్రీమియంను చెల్లించాలన్నారు. ఈ రబీ సీజన్‌కు వరి పంటకు క్రాప్ ఇన్సూరెన్స్ పథకం ప్రీమియం ఎకరాకు రూ.630 డిసెంబర్ 15లోగా చెల్లించుకోవాలన్నారు.

పత్తిలో సస్యరక్షణ చేపట్టాలి

అమరావతి: మండల పరిధిలోని ఎండ్రాయి, నరుకుళ్లపాడు గ్రామాలలో వ్యవసాయశాఖ క్రోసూరు ఏడీఏ హనుమం తరావు పత్తి పైరులో క్షేత్ర సందర్శన బుధవరాం నిర్వహించారు. ఈసందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు క్వినాల్‌ఫాస్ 2 మిల్లీలీటర్లకు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. లేకుంటే లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 2.5మి.లీ.లు కలిపి పిచికారి చేయాలని సూచించారు. కందిలో ఆకుచుట్టూ పురుగు ఆశిస్తుందని ఎకరానికి నొవోల్యురాన్ 100 మి.లీ.లు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి అహ్మద్ పాల్గొన్నారు.

నకరికల్లు: పత్తి పంట క్వింటాకు రూ.7,152 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని మండల వ్యవయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని కండ్లకుంట, చాగల్లు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు శ్రీనివాసరావు, వీహెచ్‌ఓ కె.కృష్ణ, వీఆర్‌ఓ టి.పీరా పాల్గొన్నారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: మండలంలోని ఉప్పలపాడు, రామిరెడ్డిపేటలో వరి పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి పి.వెంకటనరసయ్య మాట్లాడుతూ వరి పొలంలో ఉన్న ఆకు చుట్టు పురుగు నివారణకు వాడాల్సిన మందుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ముస్తాక్ పాల్గొన్నారు.

దళితుల విద్యాభివృద్ధికి కార్డ్స్ కృషి



ముప్పాళ్లలోని ఆర్సీఎం స్కూల్ లో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తున్న సుబ్బారావు, రాజ్యలక్ష్మి

ముప్పాళ్ల: కార్డ్స్ సమస్త బాలబాటల ద్వారా ఆటపాటలతో విద్యనందిస్తూ దళితుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్డ్స్ సంస్థ పల్నాడు జిల్లా డెప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు అన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకొని ఆర్‌సీఎం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం పోటీలు నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నతంగా చదువుకోవాలనే లక్ష్యంతోనే బాలబాటల ద్వారా గ్రామాల్లో పలు రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి ఏడాది గురుకుల పాఠశాలల్లో చేర్పించేందుకు అవసరమైన ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రన్నింగ్ పోటీలు నిర్వహించారు. బాటబాట ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోటీల్లోని విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాటిబండ్ల రాజ్యలక్ష్మి, బాలబాట ఏరియా కో ఆర్డినేటర్ మన్నం కోటేశ్వరరావు, డెవలప్‌మెంట్ ఆర్గనైజర్లు ఎం.మనోజ్, విజయ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలతో తగ్గిన ఉపాధి అవకాశాలు



దేచవరంలో ప్రజాపోరు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సత్తెనపల్లిలో శ్రీరామ్ నగర్‌లో సీపీఎం కార్యకర్తలు విస్తృతంగా కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు జడ రాజ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో ఉపాధి అవకాశాలు తగ్గిపోయి, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంతో పేదల కుటుంబాలు గడవడం కష్టంగా మారిందన్నారు. అన్ని రకాల నిత్యవసర వస్తువులు రేషన్‌షాప్‌ల ద్వారా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిశ్రమలను కాపాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా అమలు జరపాలనుకుంటున్న జమిలి ఎన్నికలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కరించాలంటూ ఈనెల 14న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజని, సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు మునగాజ్యోతి గింజుపల్లి నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాపోరు ధర్నాలో ప్రజలు విస్తృతంగా పాల్గొనాలి

నకరికల్లు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం నకరికల్లులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాలో ప్రజలు విస్తృతంగా పాల్గొనాలని సీపీఎం మండల కార్యదర్శి జి.పిచ్చారావు పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రజాపోరు ప్రచారయాత్రను మండలంలోని దేచవరం, రూపెనగుంట్ల, కండ్లకుంట, చాగల్లు, చల్లగుండ్ల, చేజర్ల, కుంకలగుంట, జిల్లాపేటతండా గ్రామాల్లో బుధవారం సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదని అన్నారు. హామీలు నెరవేర్చేవరకు ప్రజాపోరాటాలు ఆగవన్నారు. కార్యక్రమంలో ఈవూరి లక్ష్మారెడ్డి, ఈవూరి అప్పిరెడ్డి, గోవిందునాయక్, చట్టు కోటేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, రామాంజినాయక్, కొండానాయక్ పాల్గొన్నారు.

నశీర్ అహ్మద్‌కు సాహితీ పురస్కారం ప్రదానం



చరిత్రకారుడు నశీర్ అహ్మద్‌కు సాహితీ పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

పిడుగురాళ్ల: హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రకటించిన సాహితీ పురస్కారాన్ని పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ప్రముఖ చరిత్ర కారుడు సయ్యద్ నశీర్ అహ్మద్‌కు మంగళవారం రాత్రి స్వీకరించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షత డాక్టర్ నందమూరి తారకరామారావు కళామందిరంలో పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో సయ్యద్ నశీర్ అహ్మద్ ఆజాద్ రాసిన హింద్ ఫౌజ్ ముస్లిం పోరాట యోధుల గ్రంథానికి సాహితీ పురస్కారం లభించింది. ఈ గ్రంథాన్ని ఎంపిక చేసిన పలు గ్రంథాలయాలకు, ఆసక్తిగల పాఠకులకు అవార్డు అంకితం ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో ఆచార్య వైవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగా, జిమ్నాస్టిక్స్ పోటీలకు ముగ్గురు ఎంపిక

రాజుపాలెం: మండలంలోని గణపవరం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి జాతీయ స్థాయి యోగా జిమ్నాస్టిక్స్ పోటీలకు ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సుగుణమ్మ శుక్రవారం తెలిపారు. అండర్– 17 ఏళ్ల లోపు స్థాయిలో కృష్ణవిజ్ఞశ్రీ , అండర్– 14 ఏళ్ల లోపు పొట్లపాటి మహిమ కుమారి, వేల్పుల విజయలక్ష్మి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీడీ జె.రమణమ్మ, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు అభినందించారు.

లింగవివక్షపై అవగాహన

అచ్చంపేట: లింగ వివక్షతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.మాణిక్యం తెలిపారు. భేటి బచావో.. భేటి పడావా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహిళలకు బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, మహిళలపై దాడులు, లింగవివక్ష తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే ముందుగా తెలుసుకుని సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దారు సునీత, ఈఓపీఆర్డీ ప్రసాద్, పీహెచ్‌సీ వైద్యులు ఇన్నారావు పాల్గొన్నారు.

ప్రతి దుకాణం వద్ద మూడు సీసీ కెమెరాలు

- ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు సూచన
- ఇద్దరు అంతరాష్ట్ర బైక్ దొంగలు అరెస్టు



సత్తెనపల్లి: సబ్ డివిజన్ పరిధిలో ప్రతి వ్యాపారస్తుడు తమ దుకాణం వద్ద మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు చెప్పారు. ఇరువురు అంతరాష్ట్ర బైక్ దొంగలను అరెస్టు చేసిన సందర్భంగా బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిడుగురాళ్ల చిన అగ్రహారంకు చెందిన గన్నెబోయిన మణికంఠ, సత్తెనపల్లి పట్టణానికి చెందిన అంగజాల ఏసుబాబులు గత కొంతకాలంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ద్విచక్రవాహనాల చోరీలు చేస్తున్నారన్నారు. జల్సాలకు అలవాటు పడి ద్విచక్రవాహనాలు చోరీకి పాల్పడుతున్నారన్నారు. ఈక్రమంలో గుంటూరు మాయాబజారులో విక్రయించే ప్రయత్నం చేస్తుంగా, పక్కా సమాచారంతో పట్టుకోవడం జరిగిందన్నారు. వీరి నుంచి సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, రాజుపాలెం పరిధిలోని 12 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ సుమారు రూ. 8 లక్షలకు పైగా ఉంటుందన్నారు. దుకాణాల వద్ద అధికంగా సీసీ కెమెరాలు ఉంటే నిందితుల గుర్తింపు, పట్టుకోవడం సులభతరమవుతుందని తెలిపారు. ఇరువురు నిందితులను పట్టుకున్న పట్టణ సీఐ బ్రహ్మయ్య, సత్తెనపల్లి రూరల్ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు, పట్టణ ఎస్సై పవన్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌లకు పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రివార్డులు ప్రకటించనున్నామన్నారు. ఇరువురు నిందితులను కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి



క్రోసూరు: రాష్ట్ర ప్రభుత్వం మధ్యంతర భృతిని ప్రకటించి 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్రోసూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు శిఖా శాంసన్, కార్యదర్శి బండి రత్తయ్య బుధవారం ప్రభుత్వాని కోరారు. స్థానిక ఎస్సీ వసతి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగుల ఆశలకు అనుగుణంగా పరిష్కారం కానీ ఆర్థిక, ఆర్థిక సంబంధం కానీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పదేళ్లుగా ఉపయోగం లేకుండా ఉన్న ఉద్యోగుల పెన్షనర్ల హెల్త్ కార్డులు తిరిగి పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగుల సర్దుబాటు పేరుతో ప్రవేశపెట్టిన జీఓ నంబర్ 143 , జీఓ నంబర్ 32 లను సవరించాలని కోరారు.

క్లుప్తంగా

ఆస్తి పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు



సత్తెనపల్లి: పట్టణంలో ఆస్తి పన్ను చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పీటర్ పాల్ తెలిపారు. పట్టణంలో ఆస్తి పన్ను చెల్లించక బకాయిలు ఉన్న ప్రభుత్వ ఏరియా వైద్యశాల రోడ్‌లోని వాచీ షాపుల యజమాని బషీర్ అహ్మద్ రూ.52,964, శ్రీనివాస మహల్ వారు రూ. 2,88,521 బకాయిలు ఉండటంతో రెడ్ నోటీసులను అందించినట్లు చెప్పారు. సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఆయనతో పాటు 13వ సచివాలయ అడ్మిన్ షేక్ కరిముల్లా ఉన్నారు.

మున్సిపల్ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు



సత్తెనపల్లి: మున్సిపల్ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. పట్టణంలోని నందిగామ డొంకరోడ్డులో ఎస్‌బీజీ డిగ్రీ కళాశాల సమీపంలో మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని, సమాచారం అందడంతో బుధవారం ఆ స్థలం వద్ద మున్సిపల్ స్థలంగా బోర్డు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ షమ్మి మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడైనా మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీత, ఆరో వార్డు ప్లానర్ కరీం ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు అయిన ఘటన పట్టణంలోని హోలి ఫ్యామిలీ పాఠశాల వద్ద బుధవారం చోటుచేసుకుంది. వివరాలు... సత్తెనపల్లి మండలం, గుడిపూడి గ్రామం నుంచి మున్నంగి తిరుపతిరెడ్డి, సోదరి మరియరాణి రెంటచింతల చింతల వెళ్లేందుకు మాచర్ల బస్సు ఎక్కేందుకు సత్తెనపల్లి ద్విచక్ర వాహనంపై వస్తుండగా, స్పీడ్ బ్రేకర్ కనిపించకపోవడంతో రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన మరియ రాణిని గుంటూరు తరలించగా, తలకు తీవ్రగాయమైనట్లు గుర్తించారు. జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ దాన్ని ఏర్పాటు చేయడంతో ఇప్పటికి మూడు ప్రమాదాలు జరిగాయి. కనీసం రేడియం స్టిక్కర్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

సత్తెనపల్లి: పంటల సాగులో రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు, కొమెరపూడి గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి నవీన్ రైతులకు పంటల సాగులో పలు సూచనలు చేశారు.

రేపు సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో లక్ష దీపారాధన

సత్తెనపల్లి: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని ఈనెల 15న పట్టణంలోని గుంటూరు రోడ్‌లోని సనారి వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో జ్వాలాతోరణం, లక్షదీపారాధన, అయ్యప్ప స్వామి భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమం వంశపారంపర్య ధర్మకర్త, మఠాధిపతులు చింతాడ లలితాంబ మాతాజీ బుధవారం తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మల్లికార్జున స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

అమరావతి: గ్రామీణ ప్రాంత మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణను జన చైతన్య సమితి నైపుణ్యాభివద్ధి శిక్షణ కేంద్రంలో ప్రారంభించనున్నట్లు జన చైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం, నెహ్రూ యువ కేంద్ర, జనచైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ఉచితకుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అమరావతి, పెదకూరపాడు, తుళ్లూరు, క్రోసూరు, తాడికొండ పరిసర గ్రామ ప్రాంతాల మహిళలు అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు. శిక్షణ కాలం 30 రోజులు ఉంటుందని, శిక్షణ పొందిన మహిళలకు కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్లను పంపిణీ చేస్తామన్నారు. వివరాలకు శ్రీనివాస్ సినిమా థియేటర్ దగ్గర ఉన్న జన చైతన్య సమితి నైపుణ్యాభివద్ధి శిక్షణ కేంద్రంలో కానీ, 8886777767, 9492271417, 9951008337 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

నేడు ఉపాధి పనులపై ప్రజావేదిక

నకరికల్లు: ఉపాధి హామీ పథకం పనులపై గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ సుందరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో 1 నవంబర్ 2023 నుంచి 13 నవంబర్ 2024 వరకు చేపట్టిన పనులపై ప్రజావేదిక నిర్వహిస్తారని అన్నారు.

17న మండల పరిషత్ సమావేశం

ముప్పాళ్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 17వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పీజే విలియమ్స్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షుడు అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. సమావేశానికి గౌరవ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

రాజుపాలెం: జాతీయ గ్రంథాలయ వారోత్సలు రాజుపాలెం శాఖా గ్రంథాలయలో గురువారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు శాఖా గ్రంథాలయ అధికారి కేఎస్ఎస్ ప్రసాద్ బుధవారం తెలిపారు. 14వ తేదీన వేడుకల ప్రారంభోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, పఠన ప్రాముఖ్యత, 16న చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, 17న గ్రంథాలయంపై ప్రముఖుల ప్రసంగాలు, 18న క్విజ్, వక్తృత్వం పోటీలు, 19న మహిళా సాధికారతపై ప్రముఖులతో చర్చ, 20వ తేదీన వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు.

తొండపిలో ఉపాధిహామీ గ్రామసభ

తొండపి(ముప్పాళ్ల): గ్రామంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను చేపట్టబోయే పనుల ఎంపికపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. తొలుత అధికారులు, గ్రామస్తులు గ్రామంలో తిరిగి పనులను గుర్తించి ఆ మేరకు గ్రామసభలో చర్చించారు. ప్రాధాన్య క్రమంలో పనులను ఎంపిక చేయటం జరిగిందని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ఏడుకొండలు చెప్పారు.